899

# జ్యోతి

"శాంతా! శాంతా!" జ్యోతి గదిలోకి తెల్లకాగితం కోసం వెళ్ళిన విశ్వం వున్నట్లుండి బిగ్గరగా పిల్చాడు. పిలవటం కాదు. దాదాపు గావుకేక పెట్టాడని చెప్పొచ్చు.

"వస్తున్నానండీ" అసహజంగా, కోపంగా వున్న భర్త పిలుపుకి ఖంగారుపడిన శాంత చేస్తున్న పని వదిలిపెట్టి విశ్వం ఉన్న గదిలోకి పరుగెత్తుకొచ్చింది.

"ఏమిటిదంతా? ఈ ఉత్తరాలన్నీ ఎవరు రాసింది? జ్యోతి ఏది?" ఎర్రబడిపోయిన నుదుటిమీద నరాలు ఉబ్బగా చేతిలో కొన్ని గులాబిరంగు కాగితాలు పట్టుకొని అన్నాడు విశ్వం.

"ఏమిటవి? నాకేం తెలుసు? జ్యోతి దొడ్లో జడ వేసుకుంటోంది" భర్త ఉగ్రరూపం చూచి భయంతో బిగుసుకుపోతూ గబగబా సమాధానం చెప్పింది శాంత.

"ఇక్కడకు రమ్మను!" ఆజ్ఞాపించినట్లుగా అన్నాడు

విశ్వం. భర్త మొహంలోకి, అతను గుప్పిట్లో గట్టిగా పట్టుకున్న కాగితాలవైపు పరీక్షగా చూసిన శాంత అక్కడ్నుంచి కదలి వచ్చేసింది.

"మీ అన్నయ్య పిలుస్తున్నారమ్మా" అంది శాంత. దొడ్లో సాయంకాలపు నీరెండలో అద్దంలో అందంగా కనిపిస్తున్న ప్రతిబింబాన్ని వివిధ భంగిమలలో చూసుకుంటూ తల దువ్వుకుంటున్న జ్యోతి వెనక్కు తిరిగి "నన్నా!" అంది.

"అవును" శాంత ఏదో పనిమీద ఉన్నట్లు అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

"ఎందుకు?" దువ్వుకుంటున్న దువ్వెన చేత్తో అలాగే పట్టుకొని లోపలికి వచ్చింది జ్యోతి. విశ్వం తన గదిలో లేడు. "నీ గదిలో ఉన్నారు" అన్నది శాంత ఆడబడుచుని క్రీగంట చూస్తూ.

"నా గదిలోనా?" క్షణంసేపు అందంగా ఆర్చిలా ఉన్న కనుబొమలు మరింత అందంగా వంకర తిరిగాయి.

"ఎందుకన్నయ్యా పిలావుట?" తన గదిలోకి రాబోతున్న జ్యోతి గుమ్మంలోనే హఠాత్తుగా ఆగిపోయింది. మొహంలో భయాన్ని సూచించే భావం ఒకటి తళుక్కుమని వెంటనే ఆరిపోయింది.

"తలుపు దగ్గరగా వేసి లోపలికి రా" గుమ్మంలో స్థాణువులా నిలబడిపోయిన చెల్లెల్ని కటువుగా పిలిచాడు విశ్వం.

జ్యోతి కదలలేదు, లోపలికి రాలేదు. రెప్పవాల్చడం మర్చి పోయి-బొమ్మలా అలాగే నిలబడిపోయింది.

"నిన్నే" మరోసారి కోపంగా అన్నాడు. ఆమె మెల్లగా లోపలికి వచ్చి తలుపులు దగ్గరకు చేరవేసింది.

"ఏమిటీ ఉత్తరాలు? ఎవరీ సారథి?" చెల్లెల్ని చూడగానే కొంచెం కోపం చల్లారిన విశ్వం కంఠంలో మృదుత్వాం తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు.

టేబిల్ దగ్గరగా వచ్చి అంచునానుకుని నిలబడిన జ్యోతి అన్నగారి మాటకి సమాధానం చెప్పకుండా చేత్తో టేబుల్ అంచుమీద గీతలు గీస్తూ వుండిపోయింది.

"ఎన్నాళ్ళనుంచి యిది?"

దానికి జవాబు రాలేదు.

"చెప్పు జ్యోతీ! నానుంచి ఎందుకు దాచావు! ఏ విషయంలోనయినా మనసువిప్పి చెప్పే స్వతంత్రం నా దగ్గర నీకుందనే నేనుఅనుకుంటున్నాను."

టేబుల్ అంచుమీద గీతలుగీస్తున్న ఆమె కదలలేదు సరికదా; కనీసం కళ్ళుకూడా యెత్తలేదు.

"చెప్పు, ఏ విషయంలో నేను నిన్ను కాదంటున్నాను? ఈ విషయం రహస్యంగా యెందుకు వుంచావు? అసలెవరితను?"

చెల్లెలివంక పరీక్షగా చూస్తూ అన్నాడు విశ్వం.

అప్పటికీ మాట్లాడలేదు జ్యోతి.

"చెప్పమ్మా! ఈ వయస్సులో ఇలాంటివి జరగటం సహజమే! దానికి సిగ్గుపడాల్సిన సంగతి గాని, భయపడాల్సిన విషయంకానీ ఏముంది? ఇలా కూర్చో!" చెల్లెల్ని చెయ్యి పట్టి ప్రక్కనున్న కుర్చీలో కూర్చోపెట్టూ "నాకు ఓ విధముగా బాధగానే వుంది. మీ వదిన వృత్త మొద్దు అన్న సంగతి నీకు తెలుసు. అమ్మ యెలాగు లేదు. నువ్వు మనసు విప్పి చెప్పే వ్యక్తి లేరని నాకు తెలుసు. నే నడుగుతున్నా నుగా. నీ కంత నచ్చితే అతను అన్నివిధాలా నీకు తగిన వాడైతే రేపే నేను వెళ్ళి మాట్లాడ్తాను."

విశ్వం అన్న చివరి మాటకి చురుగ్గా కళ్ళెత్తి చూసి నది జ్యోతి.

"అవునమ్మా! నీ వివాహ విషయంలో నీకు పూర్తి స్వతంత్రం వుంది- అని నేను చెప్పటంలేదనా? యెవరిలను? మాటవరసకి గూడా నీ నోట యితని పేరు వినలేదే నేను!"

విశ్వం మృదువుగా మెల్లగా లాలించగా జ్యోతి ఆగి, ఆగి చివరకు యెలాగయితేనేం అంతా చెప్పింది.

సారథి కొత్తగా వచ్చిన బోటనీ లెక్చరరట. క్రొత్త, అంటే మరీ స్వల్పపరిచయం కాదు, వచ్చి ఆర్నెల్లయింది. వచ్చిన నెల రెండు నెలల్లోనే పరిచయమై స్నేహంగా మారి నది. అతనికి తనంటే చాలా యిష్టం. ఇద్దరూ కలసి ఒకసారి

సినిమాకి, రెండుసార్లు పార్కుకి—అలా కాలేజీతరఫున పిక్నిక్ కి వెళ్ళారుట.

నిదానంగా నిశ్చలంగా చెపుతున్న చెల్లెలివంక ఊపిరి బిగబట్టి వింటూ ఒక్కొక్కటే అన్ని సంగతులు తెలుసుకున్నాడు విశ్వం.

అంతా విన్నతర్వాత "అతని సంగతి వదిలెయ్యి. నీ సంగతి చెప్పు, అతనంటే ఇష్టమేనా?" కళ్ళు క్రిందికి వాల్చుకున్న చెల్లెలి మొఖంలోకి పరీక్షగా చూస్తూ అన్నాడు.

"ఇష్టంలేకపోతే అతనితో సినిమాకు, పార్కులకు యెందుకు వెడ్తాను!" జ్యోతిలో యింకా కటి బెరుకుతనం పోయింది.

"మరి యిన్నాళ్ళు నాకు తెలియకుండా యెందుకు దాచావు?"

"దాచింది ఏముంది? ముందు నాకు ఒక అభిప్రాయమంటూ అతనిమీద యేర్పడాలిగదా! రేపు రాబోయే నా పుట్టినరోజు అతన్ని యింటికి పిల్చి నీకు పరిచయం చేసి తర్వాత సంగతి చెప్పాలనుకున్నాను" ఆమె తొణుకు బెణుకు లేకుండా నిశ్చలంగా అంది.

"సరే, రేపు నేను అతన్ని కలుసుకొని మాట్లాడ్తాను, అడ్రస్ తెలుసా?"

తెలుసునన్నట్లు తలూపుతున్న చెల్లెలివైపు అనుమా

నంగా చూస్తూ "అంటే అతడి రూంకికూడా వెళ్ళావేమిటి!" అన్నాడు విశ్వం.

"లేదు. రమ్మని చాలాసార్లు అడిగాడు కాని, నేనే వెళ్ళలేదు"

విశ్వం తేలికగా ఊపిరి విడిచాడు. "ఈ సంగతి కాలేజీలో ఎవరికైనా తెలుసా!"

తెలియదన్నట్లు తలూపింది జ్యోతి.

"సరే కానీ ఒకసంగతి గుర్తుంచుకో, అతను నాకు మాత్రం నచ్చకపోయినా..."

"లేదన్నయ్యా! నీకు తప్పకుండా నచ్చుతారు"

అన్నగారి మాటలుఖండిస్తూ దృఢంగాఅంది జ్యోతి.

విశ్వానికి ఏం మాట్లాడాలో తోచలేదు. గదిలోంచి వచ్చేసేముందు ఉత్తరాలు చెల్లెలికిచ్చేసి "ఇవి కూటుకు జాగ్రత్తగా వుంచు" అని చెప్పి యివతలకు వచ్చేశాడు.

అన్నగారు గదిలోంచి వెళ్ళిపోవడంతో జ్యోతికి ప్రాణం నిల్చినట్లయింది. తను నెలరోజులనుంచి యెలా చెప్పాలా అని సతమతమౌతున్న సమస్య యింత సులభంగా పరిష్కారం అవుతుందని కల్లోకూడా అనుకోలేదు. పర్వా లేదు. అన్నయ్య తన మాటని కాదనడు. సారథి అన్నయ్యకి నచ్చకుండా వుండడు. ఒకవేళ డబ్బు, హోదా యిలాంటి విషయాల్లో అన్నయ్య సాకు చెప్పినా తను గట్టిగా పట్టుబడ్తే

సరి. కూర్చున్న చోటునుంచి లేచివచ్చి కిటికీ దగ్గరగా నిల బడింది. బైట ఆకాశంలో అప్పుడే పైకి వస్తున్న చంద్రుడు తనని చూసి చిరునవ్వు నవ్వినట్లుంది. రోజూ వీచే చల్లటి గాలే యివాళ కొత్తగా తోస్తోంది.

ఎంత బావుం దీ ప్రపంచం! అదృష్టవంతులకి అను కున్నవన్నీ లభిస్తాయి కాబోలు.

తను చిన్నప్పటినుంచి అదృష్టవంతురాలుగానే పరిగ ణింపబడ్తోంది. చాలామంది అన్నయ్య తనకు వేసే అపురూప మైన గారాబాన్ని చూసి, "నీకేం! అంత చక్కటి అన్నయ్య వున్న అదృష్టవంతురాలివి!" అంటూ అసూయపడటం అను చితమే.

ఆడపిల్ల అదృష్ట దురదృష్టాలు నిర్ణయింపబడేది అన్నయ్యలాంటి పుట్టింటి తరఫు వ్యక్తులవల్ల కాదు. ఆడదాని జీవితంలో అదృష్టం ఎప్పుడూ భర్తవ్యక్తిత్వంమీద ఆధార పడి వుంటుంది. వ్యక్తిత్వంలేని వ్యక్తి భర్తగా లభించటంకంటే భయంకరమైన శాపం యింకొకటుంటుందా! విశ్వంలాంటి అన్నయ్యద్వారా అదృష్టవంతురాలు అన్పించు కున్న తను సారథిలాంటి వాడిని పొంది జీవితానికి పరిపూర్ణ త్వం సంపాయించుకుంటుంది. కిటికీ చువ్వలమీద తల ఆన్చి కళ్ళు మూసుకున్న జ్యోతికి చల్లగా తన చెంపల్ని, జుట్టుని మృదువుగా తాకుతున్న చల్లగాలిలో సారథి వేళ్ళతాలూకు స్పర్శ కనిపించి హాయిగా అనిపించింది.

ఆ రాత్రి పడుకోబోతుండగా "నీకుబుద్ధిలేదు శాంతా!

ఇలాంటి విషయాలు మగవాళ్ళకంటే ఆడవాళ్ళ దృష్టికి తొందరగా అందుతాయి. అర్నెల్లనుంచి నీ వెనక జరుగుతున్న విషయం. నువ్వు కనిపెట్టలేకపోయావు" అన్నాడు విసుగ్గా విశ్వం. శాంతకి ఒళ్ళు మండిపోయింది, "అంచకాపాఠాలు నేర్చుకోమ్మా అని పంపిస్తే ప్రణయకలాపం జరుపుతున్న ఆవిడ బాగానే వుంది. అమ్మా-తల్లీ అంటూ హోమీ యిచ్చి యిప్పుడు తనని సాధించడం! ఇంతకీ యెవరుట అతను?" మనసులో దాచుకున్న కోపాన్ని బయటకి తెలియనీయకుండా మామూలుగా అంది.

"ఎవరో బోటనీ లెక్చరరట. మద్రాసునుంచి వచ్చాడుట.

"ఇంతకీ యేం చేయదల్చుకున్నారు?"

"చేసేదేముంది? రేపు వెళ్ళి చూస్తాను. నచ్చితే యిద్దరికీ పెళ్ళి చేసెయ్యటం!" వత్తిగిలి పడుకుంటూ అన్నాడు విశ్వం.

"మరి సుధాకరం?"

సుధాకరం, విశ్వం మొట్టమొదట్లో పనిచేసిన సీనియర్ లాయరుగారి మేనల్లుడు. అతను ముందు వెనకా ఎవరూ లేనివాడు. రేపోఎల్లుండో పారిస్ వెళ్ళబోతున్నాడు. జ్యోతిని అతనికిచ్చి చేస్తే యీడూ జోడూగా వుంటుందనీ అతనితో పాటు జ్యోతినికూడా పంపించాలనీ విశ్వం సంకల్పం.

"ఏదయినా ఈ గొడవంతా వాళ్ళకు తెలియకుండా జాగ్రత్తపడటం మంచిది" అంది శాంత.

"అవును యిదేదో తేలేవరకూ జ్యోతిని కాలేజీకి పంపకపోవటం మంచిదేమో!"

శాంత మౌనం వహించింది. అలాటి నిర్ణయాలకి సలహాలు యివ్వటం, అవును కాదు అని చెప్పటం ఎప్పుడూ అలవాటులేదు. అతనలా చెప్పినప్పుడు వినేసి వూరుకోవటం అంతే తెలుసు శాంతకి.

> > >

మర్నాడు కాలేజిటైమ్‌కి భోంచేసి బట్టలు వేసుకొని తయారవుతున్న జ్యోతిని చూస్తూ "మీ అన్నయ్య నిన్ని వాళ కాలేజీకి వెళ్ళొద్దన్నారు" అంది శాంత.

పుస్తకాలు తీసుకోబోతున్న జ్యోతి ఆగి కళ్ళు పెద్దవి చేసి 'ఎందుకు?' అంది.

"ఏమో నాకేం తెలుసు!" శాంత విసురుగా అక్కడ నుంచి వెళ్ళిపోయింది. అన్నింట్లో తనని సంప్రదించే విశ్వం జ్యోతి విషయంలో అంతమౌనం వుంచటం శాంతకి నచ్చ లేదు. నచ్చక చేసేదేంలేదు. అందువల్ల సందు దొరికినప్పు డల్లా ఆ విషయంతా ఆమెమీద చూపుతూ వుంటుంది.

ఇష్టం లేకపోయినా అన్నగారిచ్చిన ఆదేశాన్ని కాదనే సాహసంలేని ఆమె పుస్తకాలు టేబిల్‌మీద పడేసి ఇంట్లోనే వుండిపోయింది.

ఆ సాయంత్రం కోర్టునుంచి యింటికివస్తూ జ్యోతి యిచ్చిన అడ్రస్ వెతుక్కుంటూ సారథి ఇంటికి వెళ్లాడువిశ్వం.

విశ్వం వెళ్ళేసరికి సారథి ఇంట్లోనే ఉన్నాడు. అప్పుడే కాలేజీనుంచి యింటికి వచ్చినట్లున్నాడు. బట్టలు కూడా మార్చుకోలేదు. టేబిల్ మీద యేవో పుస్తకాలు సర్దుతున్న సారథి సరాసరీ చనువుగా లోపలికి వస్తున్న విశ్వాన్ని చూసి 'రండి' అన్నాడు. ఎవరో ఏమిటో అడక్కుండానే గుమ్మానికి ప్రక్కగా ఉన్న బోర్డు చూశావుగాబట్టి జ్యోతి యిచ్చిన వర్ణన గుర్తుకి వచ్చిన విశ్వం సారథి యితనే కాబోలు అనుకుంటూ "నేను"...... అంటూ జేబులోంచి కార్డుతీసి యిచ్చాడు.

"తెలుసు" కార్డుని క్షణంసేపు చూసిన సారథి నిర్లక్ష్యంగా ప్రక్కన పడేస్తూ అన్నాడు.

"జ్యోతి నా చెల్లెలు" దాదాపు తనంత పొడుగూ వుండీ తనకంటే బలంగా ఉన్న సారథిని నఖశిఖపర్యంతం పరీక్షచేస్తూ అన్నాడు విశ్వం.

"తెలుసు. నేనిదివరకు మిమ్మల్ని చూశాను" అన్నాడు సారథి మెల్లిగా.

"అలాగా!" కూర్చుంటూ అన్నాడు విశ్వం. తను జ్యోతి అన్నగార్ని అని చెప్పుకోకముందే తెలుసన్నమాట. తెలిసినవాడు ఆర్భాటంగా యేమీ హడావుడి పడడేం! విశ్వానికి ఏం మాట్లాడాలో తోచలేదు. సారథి గోడకు తగిలించి ఉన్న ఫ్లాస్కు తీసి, బయటకెళ్ళి ఎవరినో కుర్రాడ్ని పిలిచి కాఫీ తీసుకురమ్మని చెప్పాడు.

"థ్యాంక్స్ నేనిప్పుడే తాగివచ్చాను"

కాఫీకోసం రాలేదన్నట్టు అన్నాడు. సమాధానంగా లోపలికి వస్తున్న సారథి నవ్వి వూరుకున్నాడు,

విశ్వం చుట్టూ కలియచూశాడు అంత పెద్దదీ అంత చిన్నదీ గాని సామాన్యపు గది. గదిలో టేబిల్, దాని ముందు ఒక కుర్చీ తప్ప యేమీ లేవు. ఆ కుర్చీలోనే ప్రస్తుతం విశ్వం కూర్చున్నాడు గోడవారగా ఉన్న మంచంమీద పరుపులేదు ఓ మాదిరి ఖరీదుగల దుప్పటి, రెండు తలదిండ్లు వున్నాయి. ఆ గదిని చూస్తుంటే ఆర్థికంగా యజమానిగూడ మొంత మామూలు మనిషో సులభంగా తెలిసిపోతుంది. కాని జ్యోతి భర్తగా రాబోయే వ్యక్తికి డబ్బుందా లేదా అన్నది సమస్యకాదు. మనిషికి చదువు, తెలివితేటలు, జ్యోతిసున్నితమైన మనసుని అర్థంచేసుకో గలిగిన సంస్కారం వుంటే చాలు.

విశ్వం తలతిప్పి మరోసారి సారథివైపు చూశాడు. "వంటరిగా వుంటున్నారా? ఫామిలీ యెవరూ లేరూ?" సంభాషణ యెలాగో ఒకలాగు మొదలుపెట్టడం ముఖ్యం అనుకున్న విశ్వం తనే అడిగాడు.

"ఎవరూ లేరు" ఆ లేరనటంలో నిర్లక్ష్యంగా పెదవులు విరచటంలో సారథిని లేకపోతే అలాంటివ్యక్తినిఎక్కడో చూచినట్లనిపించింది విశ్వానికి.

"ఎవర్నూ లేరా?" సారథినిపరీక్షగా చూస్తూఅన్నాడు

"ఊహూ! ఒక్కగా నొక్క అక్క వుండేది: ఆ అక్క చచ్చిపోయింది.

"అలాగా! తల్లీ, తండ్రీ—"

"ఎవరూ లేరు"

విశ్వానికి ఏం మాట్లాడాలో తోచలేదు. జ్యోతి అన్న గారు అని తెలుసుకునికూడా మనిషి అలా వుంటాడేం !

అదో స్వభావం కావచ్చు.

"మిమ్మల్ని ఎక్కడో చూచినట్లుంది!"

"నన్ను చూచివుండరు. నాలాటి మనిషిని చూసి వుంటారు"

"మీ స్వంతఊరు?"

"బెజవాడ"

"బెజవాడ! అరె అయితే మీరు మా నాన్నగారి పేరు వినే వుండాలి. లాయరు విశ్వనాథంగారంటే తెలియని మనిషే వుండరు బెజవాడలో" విశ్వం ఉత్సాహంగా అన్నాడు. సారధి జవాబు చెప్పేలోపుగా యింతలో కుర్రాడు ఫ్లాస్క తెచ్చి యిచ్చాడు.

సారధి రెండు కప్పుల్లో కాఫీ పోసి ఒకటి విశ్వానికి యిచ్చాడు ఏ కారణం వల్లనో తెలియటంలేదు కాని అతను సూటిగా విశ్వంవైపు చూడడంలేదు. ఎటో చూస్తున్నాడు. ఏదో మాట్లాడుతున్నాడు. బహూశా తను జ్యోతి అన్నగారిని

అని చెప్పటంవలన ఖంగారుని అలా దాచుకోటానికి ప్రయత్నిస్తున్నాడేమో, "బెజవాడలో ఎక్కడండీ మీరుండేది?"

సారథి జవాబు చెప్పాడు. విశ్వం ఉలిక్కిపడ్డాడు. కాఫీ తాగుతున్నవాడల్లా సగంలో ఆపేసి కప్పు చేతిలో అలాగే పట్టుకుని "అరే! ఆ వీధి నాకు బాగా పరిచయమే నే ఏ యింట్లో మీరున్నది?"

"రామశాస్త్రిగారింట్లో" తాపీగా కాఫీ తాగుతూ నిదానంగా జవాబు చెప్పాడు సారథి. విశ్వం కళ్ళు పెడల్పు అయినాయి. ఈసారి సారథి. తలెత్తి సూటిగా విశ్వం కళ్ళల్లోకి చూస్తూ "మీరు మర్చిపోయి వుంటారు" బహుశా ఆ ఇంట్లో ప్రసాదరావుగారు అని హెడ్మాస్టరుగా వుండేవారు. ఆయన మా మేనమామ.

సారథి నోటినుంచి వెలువడుతున్న ఒక్కొక్క మాట ఒక్కొక్క శూలంలా విశ్వం హృదయంలో దూసుకు పోయింది. "అయితే నువ్వు—నువ్వు..." కాఫీ కప్పు టేబిల్ మీద పెట్టేసిన విశ్వం మాట పూర్తి చేయలేక పోయాడు.

"అవును, నేనే. రాజ్యలక్ష్మి తమ్ముణ్ణి. అప్పుడు అక్కడ లేను. గుంటూరులో చదువుకుంటున్నాను." కూర్చున్న విశ్వం చివాల్న లేచి నిలబడ్డాడు. క్షణంలో అతని ముఖం కందగడ్డలా తయారయ్యింది. పిడికిళ్ళు బిగబడ్తూ "అయితే జ్యోతి ఎవరో నీకు తెలుసన్నమాట!" అన్నాడు.

"మొదట్లో తెలియదు. తెలిసింతర్వాత ఆ బంధాన్ని కావాలని నేనే మరింత బిగించాను. అనుకోకుండా భగవంతుడిచ్చిన యీ అవకాశాన్ని నేను జారవిడవదల్చుకో లేదు-"

"బెదిరిస్తున్నావా?" వురిమి చూస్తూ అన్నాడు విశ్వం.

"లేదు. కొన్ని సంవత్సరాల క్రితం అక్కయ్యకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం కలిగిందని సంతోషిస్తున్నాను" నిశ్చలంగా నిదానంగా తీవిగా ఒక్కొక్కమాట తూచితూచి అంటున్న సారధిని చూస్తుంటే విశ్వానికి కంపరమెత్త సాగింది. అతని మొహంలో కన్పించే చిరునవ్వు వెయ్యి గొంగళి పురుగుళ్ళా మారి విశ్వం వంటి నిండా ప్రాకుతున్నట్లనిపించింది.

వెళ్ళిపోవటానికి ముందు కడుగు వేస్తూ "సరే, నే వెడ్తున్నాను. జ్యోతి అదృష్టవంతురాలు. నా కంఠంలో ప్రాణం వుండగా నీ చేతి కెప్పటికీ అందదు. జాగ్రత్త ఖీూ సంగతి బైటకు తేవాలనిగాని లేక దాన్ని అల్లరి చేయాలని గాని చూశావా-ఈ వూళ్ళో నాకున్న పేరు, పలుకుబడి నీ జీవితాన్ని మంటబెట్టి మసి చేస్తుంది. ఆ సంగతి మర్చిపోకు. జ్యోతికి నువ్వు యే వుద్దేశ్యంతో అయితే ఉత్తరాలు రాశావో ఆ వుద్దేశ్యమే నీ పాలిట వురితాడులా మరల్చ గలను..." విశ్వం పళ్ళు పట పట లాడినాయి. "బెదిరిస్తున్నారా!" సారధి టేబిల్ మీదున్న పుస్తకాల అడుగు

నుంచి ఓ వుత్తరాల కట్టతీసి చూపిస్తూ "ఇదిగో – దానికి సమాధానం నా దగ్గర వుందని మీరు మర్చిపోకండి." అన్నాడు. ఆ వుత్తరాల మీద రాత జ్యోతిదే, సందేహం లేదు. మరో అడుగు ముందుకు వేయబోతున్న విశ్వం హతాశుడైనట్లు ఆగిపోయి మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు. యిద్దరి మధ్యా భయంకరమైన నిశ్శబ్దం ఏర్పడింది. కాసేపాగి విశ్వం నీరసంగా తనే అన్నాడు "సరే యీ సంగతి వదిలెయ్యి. నువ్వు జ్యోతిని నిజంగా ప్రేమించావా లేదా—పోనీ అది చెప్పు!"

"దానికి సమాధానంచెప్తే చచ్చిపోయిన అక్కయ్యకి అన్యాయం చేసినవాడిని అవనూ!" వుత్తరాలకట్టని గాలిలోకి యెగరేసి పట్టుకుంటూ అన్నాడు సారథి.

విశ్వం మళ్ళీ లేచి నిలబడ్డాడు. అతని మొహంలో క్షణంసేపు జారిపోయిన కోపం, అసహ్యం రెట్టింపు బలంతో వచ్చి మళ్ళీ తిష్టవేసాయి. "సరే నీ నుంచి నా చెల్లెల్ని రక్షించుకోవడం ఎలాగో నాకు తెలుసు నీ యిష్టంవచ్చినట్లు చేసుకో" అంటూ ముందుకు కదిలాడు.

"దీన్నుంచి రక్షించినా నా ఆకర్షణ నుంచి మటుకు తప్పించలేరు. మీరు పట్టుదలపడైనా బహుశా నాకు దూరం చేయ్యొచ్చుకాని జ్యోతిమీద నా ప్రభావాన్ని తీసెయ్యలేరు. ఒకవేళ మీ పేరు ప్రతిష్ఠలతో నన్ను దూరముగా నెట్టివేసినా, జ్యోతి మనసులోంచి తీసెయ్యడం సాధ్యంకాదు. నా కోసం జ్యోతి మంచాన పడకపోతే..."

ముందు కదుగులు వేస్తున్న విశ్వం "నోర్ముయ్" అంటూ పులిలా వెనక్కు తిరగడం—తిరిగి తిరగడంలోనే చేయి చాచి బలంగా సారధిచెంపమీద ఛళ్ళుమనిపించడము అన్నీ క్షణంలో జరిగిపోయాయి.

అంతవరకూ టేబిల్‌ను ఆనుకుని అదోలా నిర్లక్ష్యంగా నిలబడ్డ సారధి తన చెంపని తాకిన చేతిని పట్టుకుని నిటారుగా నిలబడ్డాడు. అంతవరకూ నవ్వుతున్న అతనికళ్ళు నిప్పులు కురిశాయి. విశ్వం అంతకంటే మండిపడుతున్న కళ్ళతో సారధి చేతుల్లోంచి బలంగా తన చేతిని గుంజుకుని, "నేనంటేఏమిటో నీకు తెలుసుకోవాలనివుందా? జాగ్రత్త-ఖబడ్దార్" అంటూ గిరుక్కున వెనక్కు తిరిగి గబగబా బైటకు వెళ్ళిపోయాడు.

కొయ్యబారిపోయిన సారధి తేరుకుని బైటకు వచ్చి చూసేసరికి అప్పటికి విశ్వం కారులో కూలబడడం అది కదలిపోవడం కూడా జరిగింది.

* * *

ఉదయం నుంచి యింట్లో కూర్చున్న జ్యోతికి కాలమే ఆగిపోయినట్లుంది. ఎంతసేపటికీ సాయంత్రం కాలేదు. దానికి తోడుఅలవాటు ప్రకారం విశ్వం వేళకు యింటికి కూడా రాలేదు. బహుశా సారధి దగ్గరకు వెళ్ళివుంటాడు. ఈ ఆలోచన వచ్చేసరికి జ్యోతి మొహం సంతోషంగా వికసించింది.

అన్నయ్యను చూసి సారధి, సారధిని చూసి అన్నయ్య వాళ్ళిద్దరూ యెలా ఫీలవుతారు! బహుశా అన్నయ్యకు తనంటే యెంత ప్రాణమో అతనికి చెప్తుండవచ్చు. రేపు కాలేజీలో సారధిని యెలా చూడటం? యెందుకు చూడ

గూడదు ! ఇహ భయం దేనికి; ఇవాళో రేపో పెళ్ళి చేసుకొని ఒకటి కాబోతున్న వాళ్ళకి.

ఊహల్లో తేలిపోతున్న జ్యోతికి రాత్రి పది అవటాగాని ఇల్లంతా నిశ్శబ్దాన్ని ఆవరించుకోవటం కాని తెలియలేదు. పరధ్యానంగా కూర్చున్న జ్యోతికి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ బైట విశ్వం కారు హారన్ విన్పించటంతో వులిక్కిపడి కిటికీ దగ్గరకు పరిగెత్తుకొచ్చింది. అవును, విశ్వమే వచ్చింది. జ్యోతి మనసు యేదో తెలియని సంతోషంతో వుక్కిరిబిక్కిరి అయిపోయింది. పరుగెత్తుకెళ్ళి 'సారథి వచ్చాడా? యెలా మాట్లాడాడు?' అని అడగాలనిపించింది. కానీ యెలా? ఎంత అన్నయ్య అయితే మటుకు ! బలవంతాన తనను తాను కుదుటపరుచుకొని మంచం మీద అలాగే కూర్చుంది.

వచ్చిన విశ్వం మామూలుగా బట్టలు మార్చుకుని భోంచేశాడు. భోంచేస్తూ "జ్యోతి ఏది?" అని అడిగాడు.

"ఇక్కడే వున్నా నన్నయ్యా! ఏం కావాలి." తనని పిలవకపోయినా ముందు గదిలోంచి సమాధానం చెప్పింది. విశ్వం మాట్లాడలేదు; లోపలికి రమ్మనమని పిలవనూలేదు. వెంటనే సంగతేమిటో చెప్పక యేమిటీ వూరింపు! కోపం వచ్చేసిన జ్యోతి వెళ్ళి మంచంమీద పడుకుంది.

ఆ రాత్రి విశ్వం జ్యోతిని పిలవలేదు. భోంచేసిన వెంటనే తలనొప్పిగా వుందని పడుకున్నాడు.

"అతన దగ్గరకు వెళ్ళలేదూ?" తలనొప్పిగా వుందని పడుకున్న భర్తకి తలపట్టూ అడిగింది శాంతి.

"ఎవరిదగ్గరికీ" తెలియనట్లు ప్రశ్నించాడు విశ్వం.

"అదే! ఆ లెక్చరర్ దగ్గరికి!"

"వెళ్ళాను." విశ్వానికేం చెప్పాలో తోచటంలేదు. కొంచెం ఆగి "ఊఁ... జ్యోతికెలా చెప్పాలో తోచడంలేదు. ఆతను నాకు తెలుసు. ఆతనితో పెళ్ళి అవటం అనేది నేను బ్రతికుండగా జరగదు. జ్యోతికి నువ్వు మెల్లగా చెప్పు."

"బాగుంది. మధ్య నేనెందుకూ; యెప్పుడైనా ఆమె విషయంలో దేనిలోనైనా నా ప్రసక్తి వుందా? మీరే చెప్పండి" శాంత నిష్ఠూరంగా అంది. విశ్వానికి తలనొప్పి ఎందుకు వచ్చిందో శాంతకిప్పుడు అర్థం అయిపోయింది.

"అబ్బబ్బ! నా మనస్సు బాగుండనప్పుడేనా నువ్విలా మాట్లాడేది?" శాంతని దగ్గరకు లాక్కుంటూ అన్నాడు విశ్వం.

అవును తనెలా చెప్తాడు, అసలేమని చెప్తాడు? కొన్ని సంవత్సరాల క్రితం అనుకోకుండా జరిగిన ఓ సంఘటన భయంకరమైన శాపంగా మారి జ్యోతి జీవితాన్ని కబళించడానికి తయారవుతుందని తనెలా కలగంటాడు. సారధిని చూడగానే తన కెలాగో అనిపించింది. ఆ పెదవి విరుపు. కనుబొమలు వంకర తిప్పటం—అచ్చు రాజ్యలక్ష్మి...... రాజ్యలక్ష్మి మరణానికి ఓ విధంగా కారణం కావచ్చు తను. కానీ బాధ్యుడు మటుకు కాదు.

ఆ రోజుల్లో తండ్రి అంటే తనకెంత హడలుగా వుం

డేది! అక్కడికీ తను రాజ్యలక్ష్మిని ప్రేమిస్తున్నాను అంటే తండ్రి పెళ్ళి చేద్దామనే మాశాడు కాని పైకి చెప్పలేని ఏదో కారణాం కూడా లేదు.

రహస్యం రాజ్యలక్ష్మి తల్లి జీవితంలో వుంది. యెందు వల్లో యెవరికీ తెలియును.

ఆవిడను మొగుడు వదిలేశాడు. మొగుణ్నే యీావిడ వదిలేసింది అని కొందరంటారు.

ఏదయినా ఆవిడ భర్తని వదిలేసి పుట్టింట్లో అన్న గారి దగ్గర కూతుర్ని పెట్టుకొని వుండి, కొడుకును రెండో అన్నగారి దగ్గర గుంటూరులో వుంచి చదివించటం మటుకు నిజం.

తెలిసి తెలిసి మొగుణ్ని వదిలేసిన ఆవిడ కూతుర్ని తన కుటుంబంలో తెచ్చుకోవటానికి ఏ తండ్రి సాహసిస్తాడు? అందులో విశ్వం వాళ్ళ కుటుంబం పేరు ప్రతిష్ఠలకి, గౌరవ మర్యాదలకి పేరుపడింది. యెప్పుడూ ఏ విషయంలోనూ ఎవరి చేత ఆ కుటుంబం వేలుపెట్టి చూపించుకోలేదు. అదీగాకుండా విశ్వం తల్లి దండ్రులకి ఒక్కే కొడుకవడం కూడా చిక్కు తెచ్చింది. తను కాకపోతే మరొకడు అన్నట్లు యే అన్న తమ్ముడో వుంటే విశ్వం సాహసించి రాజ్యలక్ష్మి కోసం తల్లి దండ్రులని యెదిరించగలిగేవాడు. యెప్పుడూ దేనికోసం తన మనసుకాస్త కూడా నొప్పించకుండా తనపై పంచప్రాణాలుగా పెట్టుకున్న వాళ్ళకే అన్యాయం యెలా చేస్తాడు? అందుకే

తన పెళ్ళి శాంతతో ఖాయపరుస్తున్నారని తెలియగానే ముందుగా రాజ్యలక్ష్మికి చెప్పాడు తనున్న పరిస్థితి వివరించి "నువ్వు మరో పెళ్ళి చేసుకో రాజూ! ఇద్దరం స్నేహితుల్లా విడిపోదాం. నీ భర్త యెలాంటివాడయినా నేను గౌరవిస్తాను" అన్నాడు. విశ్వం యెంత విడమర్చి చెప్పినా రాజ్యలక్ష్మి బుర్రకెక్కలేదు. ఆ యెక్కనిబుర్ర అడ్డంగా ఆడిస్తూ "బాగుంది. మనిషికి యెన్ని మనసులుంటాయని నీ ఉద్దేశ్యం? మనం స్నేహితులుగా విడిపోయి, పెళ్ళిచేసుకొని మళ్ళీ కలవటమా? నా భర్తగా యింకో వ్యక్తి వస్తే నువ్వు సహించగలవేమోగాని, నీ భార్యగా యింకో మనిషిని నీ ప్రక్క నేను చూడలేను. ఆ వచ్చిన వ్యక్తిని చీల్చి రక్తం తాగాలని పిస్తుంది" అంది. విశ్వానికి యేం చెప్పాలో తోచలేదు. ఆసారి యిద్దరూ కలతలు నిండిన మనసులతోనే విడిపోయారు.

విశ్వం పెళ్ళికి లగ్నం నిశ్చయించారు. అది తెలిసిన రాజ్యలక్ష్మి ఒక్కసారి వచ్చివెళ్ళమని చీటీరాసి పంపింది. వెళ్ళి యీ మాటచెప్పి మరీ బాధపెట్టడం యిష్టంలేని విశ్వం వెళ్ళలేదు అంతే; ఆ ఒక్కసారే రాజ్యలక్ష్మి పిల్చినప్పుడు విశ్వం వెళ్ళలేదు. అదే ఆఖరిసారయింది. విశ్వం పెళ్ళి వారం రోజులుండనగా ఓరోజురాత్రి బావిలోపడి చచ్చిపోయింది. చచ్చిపోతూ విశ్వంపేరిట ఒక వుత్తరం రాసిపెట్టి పోయింది. ఆ ఉత్తరం బైటపడినట్లయితే అందరికీ విశ్వం రాజ్యలక్ష్మి చావుకి కారణం అని తెలిసేది. కానీ విశ్వంతండ్రి పలుకుబడి, డబ్బు లోకం నోరు మూయించేసింది. శాంతతో విశ్వంపెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది.

కాలం మనిషిలో మార్పులు తేలేకపోయినట్లయితే మనిషికి జీవితం యేనాడో నరకం అయితేది. జీవితంమీద అప్పుడింత కాంక్షకూడా వుండేది కాదేమో! జరిగిన ప్రతి దాన్ని మనసులోంచి తుడిచేసి మరమ్మత్తు చేసెయ్యటమే కాలం పని విశ్వానికికూడా అంతే జరిగింది. తర్వాత తండ్రి పోయాడు. మకాం హైదరాబాద్‌కు మారింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఎన్నో జరిగిపోయినాయి. వీటన్నిటి అడుగునా రాజ్యలక్ష్మి జ్ఞాపకం పీడకలలా మర్చిపోయాడు. మళ్ళీ యిన్ని సంవత్సరాల తర్వాత చచ్చిపోయిన రాజ్యలక్ష్మి బ్రతికి ఇలా సాధిస్తుందని విశ్వం అనుకోలేదు. తనకైనా ఫర్వాలేదు. బాధ్యుడు కాబట్టి భరించవచ్చు కాని జ్యోతి తనకి ప్రాణాధిక మైన వ్యక్తి. ఇదే మరీ నరకంగా అనిపించింది విశ్వానికి. ఆ రాత్రి యెంతకీ నిద్రపట్టని విశ్వం వారం తిరిగేలోపల యెలా సారథిని ఆ వూరునుండి పంపెయ్యాలా అని వుపాయాలు వెతకసాగాడు. ఈ వారం రోజుల్లో జ్యోతిని కాలేజీకి వెళ్ళనివ్వటం గాని, సారథిని కలుసుకునే ప్రయత్నం గాని చెయ్యకుండా యెలా కట్టుదిట్టం చేయాలో అదికూడా నిశ్చయించుకున్నాడు.

* * *

"సారథిని నువ్వు మర్చిపోవాలమ్మా! అతనితో మనకి పొత్తు కుదరదు. ఏ విషయంలోనూ అతనికీ మనకీ సామ్యంలేదు."

అన్నాడు ఉదయం కాఫీ త్రాగుతుండగా అన్నగా

రంటున్న మాటలకి జ్యోతి కళ్ళు పెద్ద పెద్దవి చేసుకొని చూసింది. చెల్లెలి మనసు నొప్పించటం యిష్టంలేని విశ్వం "జ్యోతీ! జీవితంలో పెళ్ళి ముఖ్యమైనదే కావచ్చు. కాని దానికి మించిన మరికొన్ని బాధ్యతలు కూడా వుంటాయి. అవి విస్మరిస్తే మనిషికి నరకం యెక్కడో కాదు యిక్కడే కన్పిస్తుంది. సారథి నాకిదివరకు తెలుసు. తెలిసి, తెలిసినేను అతని చేతుల్లో నిన్ను పెట్టలేను, నువ్వు ఆలోచించుకో" అని జ్యోతి జవాబుకు చూడకుండా అక్కడ నుంచి వెళ్ళి పోయాడు.

చాలా సేపటివరకు జ్యోతికి అన్నగారు చెప్పిందేమిటో అర్థంకాలేదు. సారథి అన్నయ్యకు నచ్చలేదా? యితకు ముందు తెలుసా? యిది యెలా సంభవం. అన్నయ్యకి సారథి తెలిస్తే సారథికి అన్నయ్య ఎందుకు తెలియదు? తెలిస్తే తనతో మాట మాత్రం కూడా అనడా? ఏదో జరగకూడనిది జరిగింది. తను వెళ్ళి సారథిని అసలేం జరిగిందీ కనుక్కోవాలి- అనుకుంటూ గబగబా బట్టలు వేసుకొని కాలేజీకి తయారవు తుండగా శాంత లోపలికి వచ్చి "యిదేదో తేలేదాకా నిన్ను కాలేజీకి వెళ్ళవద్దన్నారు" అంది "కాలేజీకి వెళ్ళవద్దా?" కోపంతో జ్యోతి మొహం యెరుపురంగు తిరిగింది. "నాకు తెలియదు ఆయన చెప్పమన్నారు. చెప్పాను. ఆయన మాట లక్ష్యంలేదు అనుకుంటే నిక్షేపంగా వెళ్ళవచ్చు. మధ్య నేనేదో అంటున్నానని మటుకు నువ్వనుకోకు."

"వదినా!" హఠాత్తుగా జ్యోతికళ్ళలోనీళ్ళుతిరిగాయి.

పుస్తకాలు టేబిల్ మీదకు విసిరేసి వెళ్ళి మంచంమీద వాలిపోయింది. అన్నయ్య వద్దన్నపని తను చేయలేదు.

ఆ బలహీనత చూసే యీ అధికారం. వెంటనే లేచి కాలేజీకి వెళ్ళి తీరాలి అనిపించింది. కాని మనసులో ఏ మూలో అన్నయ్యకి కోపం వస్తుందేమోనని భయం జ్యోతిని మంచంమీద నుంచి లేవకుండా నీరసంగా అలాగే పడేసి వుంచింది.

జ్యోతి యిష్టా యిష్టాలతో నిమిత్తం లేకుండా మూడు రాత్రిళ్ళు, మూడు పగళ్ళు గడిచిపోయినాయి. అభిమానంతో, అవమానంతో కుమిలిపోతున్న జ్యోతి "నన్ను కాలేజీకి యెందుకు వెళ్ళనివ్వరు!" అని అడగలేదు. పోనీ చదువు మధ్యలో ఆపేస్తారా! ఆపేయనీ! రేపు అందరూ జ్యోతి కాలేజీకి యెందుకు రావటంలేదని అడిగితే అన్నయ్యే సమాధానం చెప్పుకోవాలి. మూడు రోజుల్లోనే తీసేసి చిక్కిపోయి ఎలాగో అయిపోయిన చెల్లెల్ని విశ్వం చూసీ చూడనట్లు వూరుకున్నాడు. అన్నగారు కన్పించినా చూడనట్లు పక్కకు వెళ్ళిపోయేది జ్యోతి.

* * *

ముడతలుగా పెట్టి బట్టలన్నీ పెట్టెలో సర్దుకుంటున్న సారథి వెనక తలుపు చప్పుడవడంతో చటుక్కున తిరిగి చూశాడు. ఓరవాకిలిగా వేసివున్న తలుపుల్ని తోసుకుని సుడిగాలిలా లోపలికి వచ్చింది జ్యోతి.

"నువ్వా!" సంభ్రమాశ్చర్యాలతో సారథికి నోట మాట సరిగా రాలేదు.

"మీరు సాయంత్రం లోపల నన్నోసారి కలవమన్నా రని వనజ చెప్పింది."

"అవును. ముందు నువ్వు లోపలికిరా" జ్యోతిని సొంతం గదిలోకి లాగి తలుపులు వేశాడు.

"పెట్టె సర్దుకుంటున్నా రెందుకు?"

"నీకు తెలియదా? ఊరు వెళుతున్నాను."

"ఎందు కిపుడు?"

"నా అంతట నేను వెళ్ళటంలేదు. బలవంతాన మీ అన్నయ్య పంపిస్తున్నాడు."

"అన్నయ్యా!"

"అవును వనజ నీకేం చెప్పలేదూ?"

"లేదు ఫోనుచేసి మీరెలాగైనాసరే రమ్మన్నారనీ అర్జంటనీ చెప్పింది."

సారథి జ్యోతి దగ్గరగా వచ్చి బుజాలమీద చేతులు వేసి కళ్ళలోకి చూస్తూ "అవును కానీ నువ్వు రాగలవని కల్లో కూడా అనుకోలేదు. జన్మలో మళ్ళీ కనిపించవనుకున్నాను. నాకు ట్రాన్స్‌ఫర్ అయింది. నీకు తెలియదా?"

"ట్రాన్స్‌ఫరా?" జ్యోతి కళ్ళు వెడల్పయినాయి.

"అవును. అది మీ అన్నయ్య పుణ్యంగానీ, నన్ను గురించి మీ అన్నయ్య నీకేం చెప్పలేదూ!" జ్యోతిచూపులు సారథి మొహంమీదనుంచి గుండెలమీదికి వాలిపోయాయి.

"చెప్పు. ఎలాగూ వెళ్ళిపోతున్నానుగా-నిజం తెలుసుకోవాలని వుంది.

"ఏం చెప్పలేదు. మన పెళ్ళి జరగదని, మీరు మంచివారు కాదని మటుకు అన్నాడు."

"నన్ను కాలేజి మానివేయించింది నావల్లనేనా?"

జ్యోతి కళ్ళు ఒక్క క్షణంసేపు రెపరెప లాడినాయి.

"నాకీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు రాగానే మొదట రిజైన్ చేసి యిక్కడే వుండిపోవాలనుకున్నాను. కాని నా సంగతి నీకు తెలుసుగా. బీదవాడిని, జీతం ద్వారికి తేగాని భోజనం లభించదు."

జ్యోతి కళ్ళెత్తి చురుకుగా సారధి మొహంలోకి చూసింది. "నేను మంచివాడిని కాదని మీ అన్నయ్యని నిదర్శనాలు చూపించమని నువ్వెందు కడగవు? ఒక్కటే జ్యోతీ! నేను మీ అంతస్థుకి తగను. నాకు మీలా డబ్బు లేదు. నిజమేలే! నన్ను చేసుకుని నువ్వేం సుఖపడ్తావు?"

సారధి నిష్ఠూరంగా అంటూ జ్యోతి భుజాలు వదిలేశాడు. కాని జ్యోతి ఆతని చేతుల్ని వదలలేదు. పట్టుకుని భుజాలమీద వుంచుకుంటూ "నన్నేం చెయ్యమంటారో చెప్పండి" అంది. మొహం తిప్పేసుకోబోతున్న సారధి గిరుక్కున తిరిగి చూశాడు. "నిజంగా ఒక్క డబ్బే సమస్య ఐతే ఫర్వాలేదు. అన్నయ్యని నేను ఒప్పించగలను" నిశ్చలంగా చూస్తూ అంది.

"మనుష్యుల స్వభావం నీకు తెలియదు. వృత్తపిచ్చ మ్మాయివి" సారథి వంగి జ్యోతి కళ్ళమీద ముద్దుపెట్టు కుంటూ అన్నాడు.

"మీరు వెళ్ళకుండా చూసే మార్గం లేదూ?"

"ఉన్నది-ఒకే ఒక మార్గం" జ్యోతిని గుండెలకి దగ్గరగా లాక్కుని కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నాడు.

"ఏమిటది?"

"నువ్వు నాతో వచ్చెయ్యటం, మనిద్దరం యీ ఊరు నుంచి వెళ్ళిపోయి వెంటనే పెళ్ళి చేసేసుకోవటం. ఆపైన క్షమాపణలు కోరుకోవటం. పెళ్ళయిపోయినతరువాత క్షమిం చక చేసేదేం లేదు...యేం మాట్లాడవేం? ముందసలు ఈ సంగతి చెప్పు - నేనంటే నిజంగా నీకంత ఇష్టమూ?"

లాలనగా ఓ విధమైన జాలిగా అడుగుతున్న మాట లకి జ్యోతి లేత మనసు యిట్టె కరిగిపోయింది.

"మనం వెళ్ళిపోతే అన్నయ్యకు తెలియదూ?" గుండెలమీద భయం సూచిస్తున్నట్లుగా చేయి పెట్టుకుంటూ అంది.

"ఆ సంగతంతా నాకు వదిలెయ్యి. నేను చూచు కుంటాను" దృఢంగా అన్నాడు సారథి.

"అయితే పదండి- వచ్చేస్తాను."

ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

క్షణంసేపు జ్యోతివైపు పరిశీలనగా చూసిన సారథి

జ్యోతిని వదిలేసి దూరంగా వెళ్ళిపోతూ "ఉహుం వద్దు. ఆ తర్వాత నానుంచి నీ జీవితం నాశనం అయిందని నన్ను తిట్టావు, వద్దులే. నన్ను మర్చిపో. నేను దూరంగా వెళ్ళి పోతున్నాను. అసలే ఆ నెల్లూరు నీళ్ళు నీకు పడవు. ఏదన్నా అయితే..." సారథి మాటలు సాంతం పూర్తికాక మునుపే జ్యోతి గభాల్న ముందుకు వచ్చి అరచేత్తో నోరు మూసే సింది.

"వచ్చేస్తానని చెప్పలేదూ. మీరు చెప్పింది నిజమే. మనం పెళ్ళి చేసుకుంటే యే సమస్యా వుండదు. అన్నయ్య యిప్పుడు కాకపోయినా కొంతకాలం తర్వాతనైనా మారతాడు. మారకపోయినా ఫర్వాలేదు."

తన దగ్గరగా వచ్చి చెప్తున్న జ్యోతిని చేయిపట్టి మరింత దగ్గరగా లాక్కున్నాడు సారథి. అవును, జ్యోతిని ఎలాగైనా తనతో తీసుకు వెళ్ళిపోయి పెళ్ళి చేసుకోవాలి. అది విశ్వానికి తిరుగులేని శిక్ష. లేకపోతే మూడు రోజుల్లో తనని ట్రాన్స్‌ఫర్ చేయిస్తాడు! జ్యోతిని ఓసారి కన్పించమని యదాలాపంగా చెప్పాడు వనజకి. ఒకవేళ కన్పిస్తే తనని ఎప్పుడూ మరచిపోలేనంత మధురమైన స్మృతి ఒకటి జ్యోతి మనసులో ముద్రించి వెళ్ళాలనుకున్నాడు. కాని జ్యోతి మాటవరసకి అన్న తనమాట పట్టుకుని యిలా వచ్చేస్తానంటు న్నది. అవును, అదే! అదే విశ్వం మీద పగతీర్చుకోవటం. అంటే జ్యోతిని తనతో తీసుకెళ్ళిపోవటమే మార్గం.

జ్యోతీ! నిజంగా అంటున్నావా? నిజమే అయితే నేనెంత అదృష్టవంతుణ్ని!"

"నిజంగానే చెప్తున్నాను. కాని నేను యిలా వచ్చేస్తే యిబ్బంది కదూ? రెండో చీరకూడా లేదు."

"ఫర్వాలేదు. నేనంత దరిద్రుడిన్ని కాదు. మొదట మనం మద్రాస్ వెళ్ళిపోదాం" జ్యోతిని గుండెలకు అదుము కుంటూ అన్నాడు. రూపు తెలియని కసితో కూడిన విచిత్ర మైన భావంతో అతని గుండెలు నిండిపోయాయి. కళ్ళలో దాని తాలూకు సంతోషం ఉప్పొంగుతూ కన్పించింది. కానీ జ్యోతి కివేం తెలియవు. తనను ప్రేమించి, తనకోసం వున్న ట్లుండి ట్రాన్స్‌ఫర్ అయిపోయి వెళ్ళాల్సి వచ్చి, తనని ఇహ చూడడేమోనని బెంగపడ్తున్న సారధి కోసం భవిష్యత్తునే నిర్భయంగా త్యాగం చేసెయ్యాలని, తను దేనికీ వెనుతీయ కూడదని అనుకుంటోంది.

* * *

జ్యోతి వెళ్ళిపోయి నాలుగు నెలలయి పోతోంది. ఎక్కడుంది, యేమయిందీ జాడే లేదు. పరువు, ప్రతిష్ఠలమాట అటుంచి ముందు విశ్వానికి జ్యోతి సారధి చేతిలో యేం బాధలు పడ్తోందోనన్న బెంగతో ప్రాణం పోతోంది. వాళ్ళ జాడ తెలుసుకోవటానికి ఎంతో ప్రయాసపడ్తున్నాడు.

మద్రాసుకి దూరంగా ఓ మామూలు పల్లెటూళ్ళో హైస్కూలు టీచరుగా చేరాడు సారధి. ఆ మారుమూల వూళ్ళో వున్న జ్యోతికి అన్నగారు పడే బాధగానీ, పేపర్లలో వేయించడం గాని తెలియదు. తను చేసిన ఈ పనికి విశ్వం నుండి పడ్తుంటాడని, తన పేరు వినటానికి కూడా అసహ్యించు

కుంటాడని అనుకొంటోంది. ఆ వూరు వచ్చేసి కూడా దాదాపు రెండు నెలలవుతోంది. సారథి జ్యోతిని విశ్వానికి ఉత్తరం వ్రాయమన్నాడు. రాయనని స్పష్టంగా జవాబు చెప్పింది జ్యోతి. సారథి తర్కించలేదు. అతను విశ్వంమీద పగ తీర్చుకోవడానికయితే జ్యోతిని తీసుకొచ్చిన మాట నిజమే. కాని జ్యోతిలో కొన్ని కొన్ని అపురూపమైన గుణాలు, నిండయిన ఆ వ్యక్తిత్వం అతన్ని వద్దన్నా ఆకర్షించి ముగ్ధుడ్ని చేస్తున్నాయి. తను కోరినంతగా జ్యోతిని బాధ పెట్టలేక తన మీద తనే కోపం తెచ్చుకుంటున్నాడు. తను సవ్యంగా చూస్తున్నంతకాలం జ్యోతికి విశ్వం గుర్తురాడు. ఎలాగైనా విశ్వానికి తమ్మునికి తెలియాలి; అతను రావాలి. జ్యోతిని తను హింస పెడ్తున్నట్లు అతను గ్రహించాలి. అందుకే సారథి జ్యోతిని అన్నగారికి ఉత్తరం రాయమని వేధించసాగాడు.

"పోనీ. అతను రాకపోతే రాకపోతాడు; డబ్బయినా పంపమని రాయి" స్కూలుకు వెళ్ళబోతూ అన్నాడు సారథి.

"అంటే! మీరు నాకు అన్నం పెట్టలేని స్థితిలో వున్నారని అన్నయ్యకు తెలియాలా!"

"ఏమయినా అనుకో. నాకు కావల్సింది డబ్బు. డబ్బు కోసమే నిన్ను నేను పెళ్ళి చేసుకున్నాను. అది దొరకనప్పుడు నువ్వుకూడా నాకు అనవసరం" సారథి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

కోపంతో, అవమానంతో జ్యోతి మంచంమీద పడి వెక్కి వెక్కి యేడ్చింది. సారథి యెందుకిలా మారిపోతు

న్నాడు! ఎంతో ప్రేమగా తన గుండెల్లో గులాబీలు పూయించిన అతనే తిరిగి యిలా ముళ్ళు గుచ్చుతున్నాడు! మళ్ళీ ఒక్కొక్కసారి అతని కళ్ళల్లో ఎంత అనురాగం తొణికిసలాడ్తుంది! ఏమయినా జ్యోతి లేత గుండెలు ఈ తిరస్కారానికి, అవమానానికి తట్టుకోలేకుండా వున్నాయి. రోజురోజుకీ సారథి తిరస్కారం, నిర్లక్ష్యం పెరిగిపోజొచ్చినాయి. తను మొదట చూసినవన్నీ పైపై మెరుగులనీ, తాత్కాలికంగా తెచ్చిపెట్టుకున్న గుణాలనీ అర్థంకాసాగింది. ఓ రోజు సారథి బలవంతం మీద అన్నగారికి పర తనువున్న ఊరుపేరు తెలియబరుస్తూ ఉత్తరం రాసింది.

వారంరోజులు తిరిగే సరికి విశ్వం పూను వెతుక్కుంటూ వచ్చి వూడిపడ్డాడు. చిక్కిపోయి, నల్లబడిపోయి, పది సంవత్సరాలు ఎదిగిపోయినట్లున్న అన్నగార్ని దగ్గరగా వచ్చినా కూడా జ్యోతి గుర్తుపట్టలేక పోయింది.

"జ్యోతీ! నిన్ను మళ్ళీ కళ్ళతో చూస్తాననుకోలేదమ్మా" అన్నాడు విశ్వం. "అన్నయ్యా" అంటూ తన చేతుల్లో వాలిపోయిన జ్యోతిని దగ్గరకు లాక్కుంటూ, ఆ స్పర్శలో, ఆ పిలుపులో అప్పుడుగాని జ్యోతికి తను వదిలేసుకొని వచ్చిన వస్తువు ఎంత విలువైందో అర్థంకాలేదు.

"వద్దమ్మా! ఒక్క క్షణం కూడా యిక్కడుండవద్దు నువ్వు. వెళ్ళిపోదాం" విశ్వం త్వర త్వరగా అన్నాడు.

"ఎక్కడికన్నయ్యా!" బరువుగా అంది జ్యోతి.

"ఇన్నాళ్ళనుంచి ఎక్కడున్నావో అక్కడికి."

జ్యోతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి, అన్నయ్య యింత

తేలికగా తనని క్షమిస్తాడని కల్లోకూడా అనుకోలేదు. "నేను కావాలని అన్నీ వదిలేసుకొని అతనితో వచ్చేశానన్న సంగతి నువ్వు మర్చిపోయావా!"

"నీ మొహం. అసలు జరిగిన పొరపాటంతా నాది. ఆ రాత్రే నీకు సారథి అంటే యెవరో చెప్పాల్సింది. చెప్పక పోవటమే యింత అనర్థం తెచ్చింది. చెప్తే నీ లేతగుండెలు బాధపడ్తా యనుకున్నాను. కాని అది నా పొరపాటే. నీ బ్రతుకును యిలా బండలు జేస్తుందనుకోలేదు."

"ఏవరేమిటి అతను!" జ్యోతి చిత్రంగా చూసింది.

విశ్వం మెల్లగా జరిగిందంతా చెప్పాడు.

బుగ్గన చేయి ఆన్చుకొని అన్నగారు చెప్పినదంతా ఒక్క అక్షరంకూడా పొల్లుపోకుండా వింది జ్యోతి. అంతా చెప్పిం తర్వాత చివరికి ముగిస్తూ "కేవలం నన్ను సాధించ డానికే అతను నిన్ను పెళ్ళి చేసుకున్నాడని నా భయం. అలాగయితే నీ జీవితం యీ పాటికినరకంగా తయారయి వుండాలి" అన్నాడు. జ్యోతికి అసలు విషయం ఇప్పుడిప్పుడు అర్థం కాసాగింది. అదా సారథి సాధింపులో అర్థం!"

"చెప్పు, అతను ఇవేం నీకు చెప్పలేదు!"

"లేదన్నాయ్! దైవసాక్షిగా చెప్పలేదు. మామూలు గానే వున్నారు. నన్ను బాగానే చూస్తున్నారు. దేనికీలోటు లేదు నాకు" చివరిమాట కావాలనే జ్యోతి అబద్ధం చెప్పింది.

ఇంతలో స్కూల్‌నుంచి సారథి రానే వచ్చాడు. అన్నాచెల్లెళ్ళిద్దరూ నిశ్శబ్దంగా చూస్తూ కూర్చుండిపోయారు

సారధి విశ్వాన్ని చూడనట్లే లోపలికి వెళ్ళిపోయాడు. జ్యోతి మనసు చివుక్కుమంది.

"కాఫీ పెట్టలేదా యింకా" లోపల బట్టలు మార్చుకుంటున్న సారధి కటువుగా పిల్చాడు. అన్నగారి మొహంలోకి ఓసారి చూసి జ్యోతి లేచి వంటింట్లోకి వెళ్ళిపోయింది. లోపల రక్తం వుడికిపోతున్నా ప్రశాంతత తెచ్చిపెట్టుకొని మౌనంగా కూర్చున్నాడు విశ్వం. "బుద్ధిలేదూ! ఎన్నిసార్లు చెప్పాను - నా బట్టలిలా ఉంగల్లా పడేసి వుంచద్దని. తిని కూర్చుంటూ వూరికే ఒళ్ళు పెంచుకోకపోతే కొంచెం యింట్లో పని చేసుకో కూడదూ?"

విశ్వానికి వెంటనే లేచి వెళ్ళి జ్యోతిని వున్నపళంగా ఆ యింట్లోంచి బైటకొచ్చెయ్యమని చెప్పాలనిపించింది. కాని యెలా! వూరుకాని వూళ్ళో - స్టేషన్ నాలుగు మైళ్ళు. చీకట్లో జ్యోతిని తీసుకెళ్ళి తనేం చేస్తాడు. అయినా తన పిచ్చిగాని జ్యోతి వస్తుందా.

సారధి అరుపులకు సమాధానంగా జ్యోతి కాఫీగ్లాసు తెచ్చి యిచ్చింది. ఇంకోటి తీసుకొచ్చి విశ్వానికివ్వబోయింది "వద్దమ్మా, నే వెడ్తాను. మళ్ళీ ఇంకోసారి వస్తాను ఇప్పుడు బైలుదేరితే స్టేషన్‌కి ఓ గంటలో చేరుకోవచ్చు."

విశ్వం లేచాడు. అయిందేదో అయిపోయింది. పెళ్ళి చేసుకుంటే చేసుకున్నాడు. కాని సారధి సవ్యంగా ఎందుకు మాట్లాడడు! విశ్వం యిప్పుడేదయినా అంటే అతను మరింత రెచ్చిపోవచ్చు. అందుకే యేమీ అనకుండా లేచాడు.

సాధ్యమైనంత త్వరలో జ్యోతిని యిక్కడనుంచి తీసుకువెళ్ళే మార్గం చూడటం—అంతే.

"చీకటి పడిపోయింది. ఎలా వెడ్తావు?" బైటకు చూస్తూ అంది జ్యోతి.

"ఫర్వాలేదు, వస్తాను. మళ్ళీ వస్తాన్లే." విశ్వం లేచి వెళ్ళిపోయాడు. మంచీ మర్యాదా తెలియని ఆ యింట్లో వుండి మరింత అవమానం కలగచేయటం యిష్టంలేని జ్యోతి నిశ్శబ్దంగా చూస్తూండిపోయింది.

అన్నయ్య వచ్చి వెళ్ళిపోయాడు — ఎన్నాళ్ళనుంచో యెదురుచూసిన అన్నయ్య.

"ఇంత చీకట్లో వెడ్తూంటే చూస్తూ వూరుకున్నావా? ఏదన్నా అయితే ఫలనా ఇంటికి వచ్చి వెళ్ళాడని, అందరూ నన్ను కరోటకుడు అనీ అనుకోవాలా?"

తన వెనక వచ్చి అంటున్న సారథివైపు కళ్ళెత్తి చూసింది జ్యోతి. జీవితంలో అంతకు ముందెప్పుడగా అత నంటే కలగని అసహ్యమైన భావం ఒకటి గుండెల్లో కలిగింది. తనని తీసుకువచ్చేరోజున యెన్ని కబుర్లు చెప్పాడు! పెళ్ళి అయిపోగానే వెళ్ళి అన్నయ్యని క్షమాపణ కోరుకుందాం అన్నాడు. అన్నయ్య దగ్గిరికి తిరిగి వెళ్ళవచ్చు అనే ధైర్యము తోనే సారథితో అంతధైర్యముగా రాగలిగింది. కానీ తిరిగి వెళ్ళడానికి దారులేం లేకుండా అన్నిదారులు మూసేశాడు సారథి.

ఇష్టం వున్నా లేకపోయినా ఈ శిధిలాలయంలో జీవితం వెళ్ళబుచ్చక తప్పదు.

మర్నాడు రాత్రి యింకా అదోలా వున్న జ్యోతిని దగ్గరకు లాక్కుంటూ సారధి "నన్ను క్షమించు జ్యోతీ! నిన్న పశువులా ప్రవర్తించిన మాట నిజమే. మీ అన్నయ్యని చూడగానే నాకు నా అక్కయ్య జ్ఞాపకం వస్తుంది. దాంతో నాకు మంచి, చెడు వివక్షత వుండదు. పిచ్చివానివలె ప్రవర్తిస్తాను. నువ్వంటే మీ అన్నయ్య కెంత ప్రాణమో అక్కయ్యంటే నాకంత యిష్టం" జాలి నిండిన స్వరంతో మృదువుగా చెప్తున్న సారధికి యేం సమాధానంచెప్పాలో తోచలేదు జ్యోతికి. కాని అదంతా నటన అని, తన మనస్సు మళ్ళించే ప్రయత్నమనీ అనుమానం రాకపోలేదు. తన కళ్ళ ముందు అన్నగారికి జరిగిన అవమానం జన్మలో మర్చిపోలేదు.

ఆ మర్నాడు కూర్చుని తను సుఖంగా వున్నాననీ- తన మీద ఏమాత్రం అభిమానమున్నా తనని చూడటానికి రావద్దనీ జ్యోతి అన్నకు ఉత్తరం రాసింది. ఉత్తరం చివరలో 'ఒక్కసారి రమ్మని రాస్తాను-అప్పుడు మటుకు యెన్ని యిబ్బందులున్నా రావటం మానకు' అని రాసింది. విశ్వం ఉత్తరం చదివి నిట్టూర్పు విడిచాడు. జ్యోతి తనకోసం యేం చేయకుండా అనుకోగార్ని అన్నివైపులనుంచి సున్నితంగా బంధించి వేస్తోంది.

మరి నాలుగు నెలలు గడిచిపోయినాయి. అవసరంగా వున్నప్పుడు యెప్పుడైనా డబ్బుకోసం రాస్తుంది జ్యోతి.

వెంటనే పంపిస్తాడు విశ్వం. అదొక్కటే విశ్వానికి తృప్తి. కొన్నాళ్ళు పాతబడితే సారధి తనమీద పాత పగను మర్చిపోవచ్చునని అతనికి నమ్మకం.

రెండు నెలలు గడిచిపోయాయి. జ్యోతి దగ్గర నుంచి డబ్బుకోసం కబురులేదు, ఉత్తరం లేదు. చివరికి వుండబట్టలేక క్షేమం తెలియబర్చమని ఉత్తరం రాశాడు. సమాధానము ఆలస్యంగా సారధి దస్తూరితో వుత్తరం వచ్చింది. జ్యోతికి జ్వరంగా వుందనీ, డాక్టర్లు టైఫాయిడ్ అంటున్నారనీ, మందులు యిప్పించటంలో యేమీ లోపం చెయ్యటం లేదనీ రాశాడు సారధి. ఉత్తరం చాలా మామూలుగా యెలాటి వైమనస్యాలు లేకుండా వుంది. ఉత్తరం చూచిన ఆ రాత్రికి రాత్రే బయలుదేరాడు విశ్వం.

అతను వూహించింది నిజమే అయింది. ఊరుచేరుకొనే సరికి జ్యోతి చావు బతుకుల్లో వుంది. "వచ్చారా మీరు? వెల్లిగాం యిద్దామనుకుంటున్నాను..."

ఎదురుగుండా వచ్చిన సారధి మొహం, కళ్ళలో నీళ్ళు తిరగటం తరువాయిగా వుంది. గడ్డం మాసిపోయివుంది మనిషిని చూస్తే నిద్రాహారాలు లేనివాడిలా వున్నాడు.

"వెళ్ళండి కనీసం మీరు చెప్తేనయినా మందు తాగుతుందేమో. నా మాటే గిట్టటంలేదు తనకి." గదిబైట ఆగిపోతూ అన్నాడు.

విశ్వం లోపలికి వెళ్ళిపోయాడు. పీక్కుపోయిన దవడలతో, గుంటలుపడ్డ కళ్ళతో, చిక్కి శల్యమై మంచాని కంటుకుపోయిన జ్యోతి అన్నగార్ని గుర్తుపట్టే స్థితిలో లేదు.

చాలాసేపయింతర్వాత కొద్దిగా స్పృహ తెలిసిన జ్యోతి తనమీదకు వంగి పరీక్షగా చూస్తూన్నవిశ్వంమొహం తడుముతూ "ఎవరూ?" అంది.

"నేనేనమ్మా!" పెదవులు నొక్కిపట్టి దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నాడు విశ్వం.

"అన్నయ్యా! నువ్వేనా...?" గుర్తు తెలిసి గబుక్కున లేవబోతూ లేవలేక నీరసంగా వెనక్కు వాలిపోయింది జ్యోతి.

విశ్వం చూస్తూండిపోయాడు. ఏం చెప్పాలో అతనికి తోచటంలేదు. కొంచెం ఆగిన తర్వాత జ్యోతిమోడినపుల్లలా అయిన తన చేతిలోకి అన్నగారిచేతిని తీసుకొంటూ "ఇక్కడ నీకెంత అవమానం కలిగినా సరే నన్ను విడిచి వెళ్ళకు" అంది నీరసంగా.

"వెళ్ళనమ్మా! వెళ్ళను. నీకు కొంచెం నయం అవగానే నావెంట తీసుకు వెళ్ళిపోతాను." గబగబా అన్నాడు విశ్వం.

"ఆపని మట్టుకు చెయ్యకు. ఈ జన్మలో యింక నేను తిరిగిరాలేను. రావాలనిలేదు, నా ప్రాణం పూర్తిగా పోయింది అని గట్టిగా తెలుసుకుని గాని వెళ్ళకు." జ్యోతి

కళ్ళనుంచి నీళ్ళు ప్రక్కలకి జారిపోయినాయి. కొద్దిసేపట్లో మళ్ళీ స్పృహ పోయింది.

అర్ధరాత్రివేళ యెప్పుడో మెలకువ వచ్చిన జ్యోతి "అన్నయ్యా" అంటూ మళ్ళీ పిల్చింది.

"ఏమిటి? యిక్కడే వున్నాను" మెరిసబడ్డ కళ్ళతో కుర్చీకి జారగిలబడి కూర్చున్న విశ్వం ముందుకు వంగి ఆదుర్దాగా అడిగాడు. ఈ రాత్రి గడవదని, గడిచిందంటే యిహ ఫర్వాలేదనీ డాక్టరు చెప్పాడు. కాని యీ రాత్రి గడుస్తుందన్న నమ్మకం విశ్వానికి కనిపించడంలేదు.

"నేను చచ్చిపోతే నా చితికి నిప్పు యెవరు అంటిస్తారు?"

"జ్యోతీ!..." విశ్వం వెనక్కు తగ్గాడు.

"అడుగుతున్నాను చెప్పు. నన్ను ప్రేమించని వాళ్ళు నాకు కొరివిపెడ్తే నేను పిశాచంగా మార్తాను అన్నయ్యా! ఆ తంతు అంతా నీ చేతుల మీద నువ్వే పూర్తిచెయ్యి."

"నువ్వు కళ్ళు మూసుకు పడుకో" విశ్వం జ్యోతి తల నిమురుతూ అన్నాడు.

"నిన్ను చూస్తూంటే మళ్ళీ బతకాలనిపిస్తోంది. నీ చెల్లెలుగా మామూలుగా తిరగాలనిపిస్తోంది. కాని... కాని" ఏదో చెప్పబోయి ఆగిపోయింది జ్యోతి.

"చెప్పు-యేమిటది?"

"అతను నీమీద పగ తీర్చుకోవటం కోసమే నన్ను పెళ్ళి చేసుకున్నాడేమో. కాని నేను అతన్ని కావాలని మన సారా ప్రేమించే చేసుకున్నా. అందుకే నీ దగ్గరికి తిరిగి రాలేక పోయాను. నన్ను క్షమించు."

"జ్యోతీ..." దూరంగా కూర్చున్న సారధి పిచ్చి వాడిలా జుట్టు పీక్కున్నాడు.

జ్యోతి చెప్పింది నిజమే. కావాలని ప్రతీకారం కోసమే-విశ్వాన్ని సాధించటం కోసమే-పెళ్ళి చేసుకున్నాడు. కాని తర్వాత అతడు మారాడు. ఆ మార్పు జ్యోతిగుర్తించ లేదు. అదికూడా నటన అనుకుంటోంది. తనలో వచ్చిన యీ మార్పు యెలా తెలియచేయాలో తోచక తికమక పడు తున్నాడు సారధి. కాని అప్పటికే సమయం మించిపోయింది. తెల్లవారుఝామున అన్నగారి ఒళ్ళో తలపెట్టుకుని జన్మ జన్మాలకి విశ్వంలాంటి అన్నయ్యే కావాలని భగవంతుడ్ని అడుగుతానంటూ ప్రాణం విడిచింది జ్యోతి. చనిపోయే ముందు ఒక్కసారి కూడా-మాట వరసకి కూడా - సారధిని గురించి అడగలేదు.

జ్యోతి చనిపోయిం తర్వాత విశ్వంలేచి సారధి దగ్గ రగా వస్తూ పిడికిళ్ళు బిగించి పళ్ళు నూరుతూ "చూడు. యిహ నేనంటే యేమిటో నీకు చూపిస్తాను. జ్యోతిని పెట్టిన బాధలకి..." విశ్వం మాటలు పూర్తి కాకుండానే సారధి వెనక్కు తిరిగాడు. అతని చూపుల్లో వెనకటి ధీరత్వం గాని, నిర్లక్ష్యం గాని లేవు. పులిలా నిప్పులు కక్కుతున్న కళ్ళతో

తన మీదకి వస్తున్న విశ్వాన్ని చూస్తూ నిదానంగా "నీ యిష్టం వచ్చింది చేసుకో, యేం చేసినా నీ చెల్లెలు నీకు తిరిగి రానట్లే, నా మామూలు జీవితం కూడా నాకు తిరిగి రాదు. జ్యోతిలేని జీవితం యెలాటిదయినా నాకు ఒకటే" నిశ్చలంగా అన్నాడు.

రేగిపోయిన జుట్టుతో, నలిగిపోయిన బట్టల్తో, శూన్యం నిండిన కళ్ళతో, యెలాగో యేమీ చేతకాని వాడిలా నిలబడిపోయిన సారథిని క్షణంసేపు పరీక్షగా చూసి కుర్చీలో కూలబడుతూ "మరి మారిన వాడివి ఆ మార్పు అది గుర్తించేలా యెందుకు చేయలేక పోయావు?" అన్నాడు.

సారథి మొహం తిప్పుకుని బైటకు చూస్తుండి పోయాడు. అతను దానికి సమాధానం యేం చెప్పగలడు? తనంటే యేమిటో తను తెలుసుకొనే లోపలే, అది గ్రహించే లోపలే అప్పటికే దెబ్బతిన్న మనసుతో జ్యోతి దూరంగా వెళ్ళిపోయింది; దూరంగా వెళ్ళిపోయిన జ్యోతిని అందుకో వటం అతనికి సాధ్యంకాలేదు.

సారథికి కళ్ళలో నీళ్ళు నిండి టప్‌మని క్రిందపడ్డాయి.

"అతని మాటేమో గాని నేను అతన్ని మనసారా ప్రేమించేవచ్చానన్నయ్యా" అన్న జ్యోతిమాటలుశూలంలా సారథి గుండెల్ని చీల్చసాగాయి.

తను ప్రేమించలేదని జ్యోతికెలా తెలుసు? జ్యోతి ప్రేమలో తన పగ మంచులా కరిగిపోయింది. ఈ విషయం తెలియబరచే అవకాశం తనకివ్వకుండానే జ్యోతి వెళ్ళిపోయింది.

నీళ్ళునిండిన కళ్ళని తుడుచుకుంటూ సారథి వెనక్కి తిరిగి "ఆ యేర్పాట్లేవో మీరే చూడండి. అందులో నా చేయి కలిస్తే జ్యోతి ఆత్మకి శాంతికూడా వుండదేమో" అన్నాడు.

"సారథి!..." జీవితంలో మొదటిసారిగా సారథి పేరు పెట్టి పిలుస్తూ విశ్వం చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

విశ్వం బైట కేడుస్తున్నాడు; సారథి హృదయం లోలోపలే రోదించ సాగింది.

ఇద్దరూ నిశ్శబ్దంలో చలనంలేని బొమ్మల్లా నిలబడి పోయారు... ... ...